www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 30 జనవరి 2025
5

అదనపు జిల్లా న్యాయమూర్తిగా ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-కడప

రాజంపేట మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఎస్.ప్రవీణ్ కుమార్‌కు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రవీణ్ కుమార్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా కడపలో పనిచేస్తున్నారు. గతంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జిగా కూడా విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో ఎన్నో కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్లకు డ్రైవింగ్ లైసెన్సులను ఇప్పించడం, ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌జెండర్స్ కాలం పెట్టించడం, కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థను రాష్ట్రంలో ఉత్తమ న్యాయ సేవాధికార సంస్థగా, ఉత్తమ పారా లీగల్ వాలంటరీ అవార్డును తెప్పించడంలో ప్రవీణ్ కుమార్ కృషి చేశారు.

జిజిహెచ్ క్యాంటీన్‌పై టిడిపి కన్ను!

- జిల్లాకు చెందిన కీలక నేత ఒత్తిడి
- ఉన్నఫళంగా వెళ్లిపోవాలని నిర్వాహకునికి హుకుం
- తెరవెనుక చక్రం తిప్పుతున్న ఓ కార్పొరేటర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా సర్వజన ఆస్పత్రి క్యాంటీన్‌పై టిడిపి నేత కన్నేపడింది. ఆలోచన వచ్చిందే తడవుగా జిల్లా కేంద్రానికి చెందిన కీలక టిడిపి నాయకుడు ఒత్తిడి పెంచారు. ఒత్తిడి దరిమిలా సంబంధిత జిజిహెచ్ అధికారి 24 గంటల్లోపు క్యాంటిన్ ఖాళీ చేయాలని ఆదేశించడం చర్చనీ యాంశంగా మారింది. సంబంధిత క్యాంటిన్ నిర్వాహకునికి ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఏళ్ల తరబడి క్యాంటిన్ నిర్వహణ ద్వారా పొట్టపోసుకున్న క్యాంటిన్ నిర్వాహకుడు ఉన్నఫళంగా ఖాళీ చేసి వెళ్లిపోవాలంటే ఏమి చేయాలో దిక్కుతోచని నేపథ్యంలో క్యాంటిన్ నిర్వహణ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో తెలియక, రాజకీయ నాయకుల దగ్గరకు పరుగులు తీస్తున్న వైనం కనిపిస్తోంది.

జిల్లా సర్వజన ఆస్పత్రిలోని ఐపి విభాగంలో రెండు క్యాంటీన్లు ఉన్నాయి. ఒక క్యాంటీన్‌ను జిజిహెచ్ ఆవిర్భావం నుంచి పుట్లంపల్లికి చెందిన అయ్యవారురెడ్డి నెలకు రూ.33 వేల అద్దె చెల్లింపులతో నిర్వహిస్తున్నారు. జిజిహెచ్ అధికార యంత్రాంగం మరో క్యాంటిన్‌ను ఖాళీగానే ఉంచడంతో వైద్యుల సౌకర్యార్థం పేరుతో సదరు నిర్వాహకుడే అనధికారికంగా వినియోగించుకుంటున్న వైనం కనిపిస్తోంది. టిడిపి అధికారంలోకి రావడంతో పరిస్థితి మారింది. కడప కార్పొరేషన్‌కు చెందిన ఓ కార్పొరేటర్ తన అనుచరుడికి ఇప్పించుకోవాలనే ఉద్దేశంతో క్యాంటిన్ నిర్వాహకుడిని వెళ్లిపోవాలని హుకుం జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. జిజిహెచ్ అధికారి వంతపాటడంలో మతలబేమిటో తెలియడం లేదనే చర్చ నడుస్తోంది. దశాబ్దాల తరబడి క్యాంటిన్ నిర్వహిస్తున్న నిర్వాహకుడిని కాదని, ఉన్నఫళంగా ఖాళీ చేయాలని ఒత్తిడి చేయడమేమిటనే వాదన నడుస్తోంది. జిజిహెచ్ అధికార యంత్రాంగం పారదర్శకంగా రెండు క్యాంటిన్ గదులకు ఆన్‌లైన్ టెండర్ పిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆఫ్‌లైన్ టెండర్ల ద్వారా క్యాంటిన్లను కట్టబెడితే జిజిహెచ్ ఒక క్యాంటిన్‌కు లభిస్తున్న కనీస అద్దె కూడా దక్క దనే సంగతిని గమనంలో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

- యురేనియం పరిశ్రమ పరిశీలనలో కలెక్టర్ శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-వేముల

పర్యావరణ సహితంగా యురేనియం (యుసిఐఎల్) ప్రాజెక్టును నిర్వహించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టును సందర్శించి సంబంధిత అధికారులతో ప్రాజెక్ట్ పనులు, ఉత్పత్తులు, ఇతర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనుల్లో ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా భద్రత ప్రామాణాలను పాటించాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ, భద్రతాపరమైన అంశాల్లో ఎలాంటి అలసత్వం వహించారాదన్నారు. ప్లాంటేషన్ (మొక్కల పెంపకం) కార్యక్రమాన్ని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చేపట్టాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. యురేనియం గనుల వల్ల పరిసర గ్రామాలు ప్రభావితం కాకుండా చూడాలన్నారు. జిల్లా విపత్తు నిర్వహణ కమిటీతో సమన్వయం చేసుకుంటూ మాక్ డ్రిల్ లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. మొదట యుసిఐఎల్ అధికారులు ప్రాజెక్టుపై పిపిటి ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. యురేనియం ప్రాజెక్టుకు ఏ పల్లెలు దగ్గరగా ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. యురేనియం ప్రాజెక్టు (టైలింగ్) వ్యర్థపదార్థాల నిల్వలు, స్టోరేజ్ సామర్థ్యం వంటి అంశాలపై ఆరా తీశారు. 300 ఎకరాలలో తుమ్మలపల్లి వ్యాలీలో నూతన వ్యర్థపదార్థాల స్టోరేజ్ ప్రాంతాన్ని గుర్తించినట్లు కలెక్టర్‌కు తెలుపగా ఇప్పటినుంచే సర్వే పనులు మొదలుపెట్టి అందుకు సంబంధించిన పనులు పూర్తి చేయాలన్నారు. రోజుకు ఎన్ని టన్నుల యురేనియం ఉత్పత్తి అవుతుందని అధికారులు అడిగి తెలుసుకున్నారు. గనుల్లో ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఎన్ని షిఫ్టులు నిర్వహిస్తున్నారని అధికారులు అడిగి తెలుసుకున్నారు. వెంటిలేషన్, హానికర వాయువులు, అంబులెన్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాసులరావు, యుసిఐఎల్ అధికారులు సుమన్ సర్కార్, కిషోర్ భగత్, శ్రీకాంత్, మాతి వన్నన్ సంజయ్ చటర్జీ, పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య, ఆర్‌అండ్‌బి డిఇ మాధవి, రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం దుర్వినియోగంపై కోర్టును ఆశ్రయిస్తాం : వైసిపి

ప్రజాశక్తి - కడప

కడప నగరంలో 2 ఎకరాల ఆర్‌అండ్‌బి ప్రభుత్వ స్థలాన్ని టిడిపి కార్యాలయ నిర్మాణానికి ఇవ్వడం దారుణమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టిడిపి కార్యాలయానికి రూ.కోట్లు విలువైన స్థలం ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. 99 ఏళ్ల వరకు లీజుకు కేటాయించడంపై అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలం దుర్వినియోగంపై కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే స్థలాన్ని ఒక పార్టీకి దారాదత్తం చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రతి పార్టీకి కార్యాలయం ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కడప నడిబొడ్డున రూ.80 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని టిడిపికి కేటాయించడాన్ని ఖండిస్తున్నామన్నారు. అమరావతి పేరు చెప్పి గ్రాఫిక్స్ చూపి కాలం గడిపేస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు పేరుతో ప్రజలను చంద్రబాబు మోసం చేశారన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, ఎన్నో పథకాలు ఇస్తామని ఒక్కటి నేరవేర్చలేదని పేర్కొన్నారు. 8 నెలల కూటమి ప్రభుత్వంలో రూ.వేల కోట్ల అప్పులు చేశారు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజల తరపున నిత్యం పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంచుకోవాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్

పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నగర శివార్లలోని ఫైరింగ్ రేంజ్‌లో ఎఆర్ పోలీసు సిబ్బందికి మొబిలైజేషన్లో భాగంగా ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఎకె 47, మసాడా, గ్లాక్ పిస్టల్ ద్వారా ఎస్‌పి ఫైరింగ్ సాధన చేశారు. 'వజ్ర' వాహనం నుంచి గ్యాస్ షెల్స్ ఫైరింగ్ చేసి పరిశీలించారు. ఆయుధ నైపుణ్యాలను పరీక్షించారు. ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పోలీసులు విధుల్లో వినియోగించే ఆయుధాలతో ఫైరింగ్ చేయించారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఫైరింగ్ ఃలో ప్రతి ఒక్కరు పాల్గొని మంచి మెలకువలు నేర్చుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు చాలా కీలకమన్నారు. అత్యవసర సమయాలలో ప్రజల మాన, ధన, ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్‌పి బి.రమణయ్య, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, ఆర్‌ఐలు ఆనంద్, వీరేష్, శ్రీశైలరెడ్డి, టైటాస్, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఫైరింగ్ ఆయుధాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి అశోక్ కుమార్

మద్దతు ఉపసంహరించుకోవాలి : డిసిసి

మాట్లాడుతున్న విజయజ్యోతి

ప్రజాశక్తి - కడప

చంద్రబాబు నాయుడు తక్షణమే కేంద్ర ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరించుకోవాలని డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి అన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు చంద్రబాబు పోరాటం చేయాలన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 2014, 2024లో ఎన్‌డిఎ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారన్నారు. రెండు సందర్భాల్లోనూ రాష్ట్రానికి ఏమి న్యాయం జరగలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించడంలో, నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమైన కేంద్ర ప్రభుత్వాన్ని చంద్రబాబు గట్టిగా నిలదీయలేకపోయారన్నారు. సూపర్ సిక్స్ బడ్జెట్‌కు తగిన నిధులు కేంద్రం నుంచి లభించలేదని స్పష్టమైందని తెలిపారు. తల్లికి వందనం, ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేలు ఆర్థిక సాయం పథకాలు ఇవ్వలేనని చంద్రబాబు చెప్పడం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం మధ్య సంబంధాలు సక్రమంగా లేవని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఇది రాష్ట్ర ప్రజల హక్కులపై జరుగుతున్న తీవ్ర అన్యాయానికి నిదర్శనం అని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించనప్పుడు టిడిపి ప్రభుత్వం ఇంకా ఎన్‌డిఎలో ఉండటానికి ఏమాత్రం అర్హత లేదన్నారు. చంద్రబాబు తక్షణమే కేంద్ర ప్రభుత్వానికి ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు గట్టి పోరాటం చేయాలని డిమాండ్ చేశారు.

నాగభూషణం కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-గోపవరం

బద్వేల్ పట్టణంలోని శ్రీ రాచపూడి నాగభూషణం కళాశాలలో బుధవారం ఫస్ట్ సోర్స్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. సుమిత్ కుమార్, జాహ్ టీం ఆధ్వర్యంలో అర్హత ఉన్న అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేసి సెలెక్ట్ చేశారు. ఈ జాబ్ మేళాకు 27 మంది అభ్యర్థులు హాజరయ్యారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ముంబైలో జాబ్స్ ఉంటాయంటూ వివరించారు. జీతం సంవత్సరానికి రూ.మూడు లక్షల ప్యాకేజీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో రాచపూడి నాగభూషణం కళాశాల పరిపాలన అధికారి రాచపూడి సాయికృష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ, అశోక్, కబీర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు : సిఐ

ప్రజాశక్తి-గోపవరం

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని బద్వేలు రూరల్ సిఐ నాగభూషణం అన్నారు. బుధవారం నెల్లూరు హైవే రోడ్డులో రోడ్డు ప్రమాదాలు తరచుగా జరిగే ప్రదేశంలో ఎన్‌హెచ్ వారి సహకారంతో రోడ్డు మీద స్పీడ్ బ్రేకర్లు, హైవే రోడ్డుపైన పెయింట్స్, మార్కింగ్ హెచ్చరిక బోర్డులను ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ముందస్తుగా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని తెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరు కూడా హెచ్చరిక బోర్డులను గమనించి అతివేగాన్ని తగ్గించి నెమ్మదిగా వాహనాలు నడిపి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు కూడా నిబంధనలు పాటించాలన్నారు.

రోడ్డుపై మార్కింగ్‌ను పరిశీలిస్తున్న సిఐ నాగభూషణం

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : సిపిఎం

ప్రజాశక్తి-అట్లూరు

ప్రజలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సిపిఎం మండల కార్యదర్శి రమణయ్య అన్నారు. బుధవారం అట్లూరులో స్మార్ట్ మీటర్లను బిగుస్తుంటే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలపై పెద్ద ఎత్తున భారం పడబోతుందని తెలిపారు. స్మార్ట్ మీటర్ను ఈరోజు ఉచితంగాబిగించేసి తరువాత 90 నెలల వరకు ఈ మీటర్ ఖరీదు రేటు బిల్లులో పొందుపరుస్తూ ప్రజలపై భారాలు వేయడానికి ఈ ప్రభుత్వం పూనుకున్నదని తెలిపారు. చాలామంది వినియోగదారులకు తెలియదన్నారు. మనం వాడిన కరెంట్ స్మార్ట్ మీటర్ రేటు వసూలు చేస్తారని పేర్కొన్నారు. ప్రమాదకరమైనది మీటర్లను సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. ప్రజలను కూడా స్మార్ట్ మీటర్లు బిగించుకోవద్దని వాటిని తిరస్కరించి వ్యతిరేకించాలని కోరారు.

స్మార్ట్ మీటర్ చూపిస్తున్న రమణయ్య

మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, కోశాధికారి గోపి డిమాండ్ చేశారు. బుధవారం కమిషనర్‌కు, తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కాస్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాలలోని ఉద్యోగులకు సంక్షేమ పతకాలు అమలు చేయాలని కోరారు. రూ.15 వేలు వేతనం ఇచ్చి వారిని ప్రభుత్వ ఉద్యోగి అని చూపడం దుర్మార్గమన్నారు. ఆప్కాస్ కార్మికులకు ఆర్థిక శాఖలో పెండ్డింగ్‌లో ఉన్న జిఒ 36 విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పనిముట్లు ఇవ్వాలని, స్వెటర్స్ ఇవ్వాలని పేర్కొన్నారు. కొంత మందికి శిక్షణ ఇవ్వాలని కోరారు. రూ.15 వేల వేతనం తీసుకునే కార్మికులకు కనీసం ఫ్రీ గ్యాస్ కూడా రావడం లేదని తెలిపారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఫిబ్రవరిలో దీక్షలు చేసి ఆందోళనకు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పర్మినెంట్ నాయకులు ఆర్.కొండయ్య, శ్యాం బాబు పాల్గొన్నారు.

సచివాలయాల్లో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి-గోపవరం

మండలంలోని గుంతపల్లి, కుమ్మరకొట్టాలు, భావనారాయణ నగర్, తొట్టిగారిపల్లి సచివాలయాల్లో బద్వేలు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి బుధవారం ఆకస్మింగా తనిఖీ చేశారు. మూవ్మెంట్ రిజిస్టర్, హాజరు పట్టిక, కంప్లైంట్ రిజిస్టర్, కుళాయి కనెక్షన్లు రెగ్యులరైజ్ రిజిస్టర్, ఇంటి పన్నులు వసూళ్ల రిజిస్టర్, హౌసింగ్ 2.0లో నమోదు చేసిన అప్లికేషన్స్ వంటివి తనిఖీ చేశారు. విధులకు సకాలంలో హాజరుకానీ 8 మంది సెక్రటరీలకు షోకాజు నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం సిబ్బంది అందరూ కూడా విధులకు సకాలంలో హాజరయి ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

ఎస్‌పిని సన్మానించిన సలావుద్దీన్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన ఇ.జి.అశోక్ కుమార్‌ను ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ మాట్లాడుతూ నగరంలో సిసి కెమెరాల ఏర్పాటు, దొంగతనాలు, ట్రాఫిక్ సమస్యలపై డిఎస్‌పిగా ఉన్నప్పుడు పరిష్కరించారని గుర్తు చేశారు. జిల్లాపై పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు. అసాంఘిక శక్తులకు తావు లేకుండా లా అండ్ ఆర్డర్‌ను పటిష్టపరిచి ప్రజలకు రక్షణగా పోలీసులు ఉండే విధంగా తీర్చి దిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎస్‌పిని సన్మానిస్తున్న సలావుద్దీన్

ఎస్‌పిని కలిసిన 'పెనుబాల' : ఎస్‌పి అశోక్ కుమార్‌ను దళిత నాయకులు పెనుబాల విజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన తనయుడు బిజువేంద్ర కుమార్‌తో కలిసి ఎస్‌పిని శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేశారు. పెనుబాలు మాట్లాడుతూ గతంలో డిఎస్‌పిగా ఉన్న సమయంలో పేద, బడుగు, బలహీన, మైనార్టీ, దళిత, గిరిజన వర్గాల ప్రజలకు న్యాయం చేయడంలో అగ్రభాగాన నిలిచారని కొనియాడారు.

ఎస్‌పికి మొక్క అందజేస్తున్న పెనుబాల

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు : ఎస్‌పి అశోక్ కుమార్‌ను ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎం.వివేకానందరెడ్డి, అధ్యా పకులు, విద్యార్థులు ఆయనకి స్వాగతం పలికారు. పట్టు శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జీవితంలో ఆదర్శమైన లక్ష్యాన్ని ఎంచుకోవాలని చెప్పారు. ఆ లక్ష సాధనకు అహర్నిశలు నిర్మణాత్మ కంగా కృషి చేయాలని పేర్కొన్నారు.

ఎస్‌పితో డైరెక్టర్ వివేకానందరెడ్డి

స్కూల్‌కు మంచిపేరు తేవాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-కాశినాయన

ఎపి మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు బాధ్యతగా ఎవరి కర్తవ్యం వారి నెరవేర్చి మోడల్ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఎంఇఒ నిర్మల పేర్కొన్నారు. ఎపి పాఠశాలలో రెండు రోజుల నుండి ఇద్దరు డిఆర్‌పిలు సోషల్ ఆడిట్ నిర్వహించారు. రెండు రోజులు వారికి వచ్చిన ఫిర్యాదులు అక్కడే ఉన్న స్థితిగతులపై ఉపాధ్యాయుల పనితీరు చదివి వినిపించేందుకు బుధవారం ఆ పాఠశాలలో ఒక సామాజిక తనకి గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ యొక్క గ్రామ సభకు ముఖ్యఅతిథిగా ఎంఇఒ నిర్మల హాజరయ్యారు. డిఆర్‌పిలు వారు సేకరించిన విషయాలను చదివి వినిపించిన తర్వాత ఆమె మాట్లాడుతూ అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మంచి విద్యను బోధించాలన్నారు. చిక్కీలు, కోడిగుడ్లు పెద్ద ఎత్తున ఎందుకు తక్కువొచ్చాయి, ఎక్కడికి పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ ఆడిట్ వారు ఇవి తక్కువ వచ్చాయని క్లుప్తంగా రాశారని దీనికి సరైన సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య, స్కూల్ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ జమాల్ బాషా, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎంఇఒ నిర్మల



పాఠశాల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కార్పొరేటు స్థాయిలో ప్రభుత్వ పాఠశాల : కలెక్టర్

ప్రజాశక్తి-సింహాద్రిపురం

కార్పొరేట్ స్థాయిలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఉందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాలను ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలోనే సింహాద్రిపురం హైస్కూల్ ఓ మోడల్‌గా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు కామన్ మ్యాన్ కార్పొరేట్ స్కూల్, సైన్స్, ఇంగ్లీష్ ల్యాబ్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పులివెందుల నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, హెచ్‌ఎల్‌సి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ జోగిరెడ్డి, మాజీ జడ్‌పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిడిపి నాయకులు రఘునాథరెడ్డి, డిఇఒ శంషుద్దీన్, మండల ప్రత్యేక అధికారి సన్నన్న, ఎంపిడిఒ కృష్ణమూర్తి, తహశీల్దార్ నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు అరవిందనాథ్‌రెడ్డి, పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఇఇ రాజశేఖర్, ఎంఇఒ ఓబులేసు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరి, దాతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నగరంలో పర్యటించిన ఎమ్మెల్యే, కమిషనర్

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి మార్నింగ్ విజిట్లో భాగంగా నాగరాజుపేట, కాగితాలపెంట, రాజారెడ్డి వీధులను పారిశుధ్య విభాగ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. క్లాప్ వాహనాలు ఇంటింటి చెత్త స్వీకరణ వందశాతం చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కమర్షియల్ నుంచి వచ్చి వ్యర్థాలను సెకండరీ వెహికల్స్ అనగా కమర్షియల్ వాహనాలను సమకూ ర్చుకునేలా చర్యలు తీసుకోవాల్సిందిగా సానిటరీ విభాగ అధికారులకు ఆదేశిం చారు. అనంతరం ఎమ్మెల్యే మాధవి గుడ్ మార్నింగ్ కడప, స్వచ్ఛ కడప కార్యక్ర మంలో భాగంగా ఎర్రముక్కపల్లి ప్రాంతాలను ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటే షన్ విభాగ అధికారులతో ఆ ప్రాంతాలలో చేయవలసిన పనులను గురించి సందర్శించారు.

మురుగు కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి

ధ్వజారోహణతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-కడప అర్బన్

తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణతో ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన పూజారి కృష్ణమాచారి, టిటిడి వేద పండితుల సమక్షంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని రంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.

రథోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి

దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 4వ తేదీ నిర్వహించే రథోత్సవ ఏర్పాట్లను ఎస్‌పి అశోక్ కుమార్ పరిశీలించారు. ఆలయ ఇన్స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డిని భక్తుల సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వర రెడ్డిని ఎస్పీ ఆదేశించారు. ఆలయం చుట్టూ తిరిగి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిఐ, ఎస్ఐ, ఎఎస్ఐ పాల్గొన్నారు.



ధ్వజారోహణలో ప్రధాన అర్చకులు

రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సాగు చేసిన ప్రతి రైతు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు సూచించారు. బుధవారం మండలంలోని నంద్యాల పల్లెలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఇన్సూరెన్స్ పంటలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 2.52 లక్షలు ఎకరాలు ఇకెవైసి చేయాల్సి ఉండగా, 1.73 లక్షల ఎకరాలు పూర్తయిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 72 శాతం పూర్తయిందన్నారు. చేయడం జరిగిందన్నారు. అనంతరం బుడ్డశనగ, కంది పంటలను పరిశీలించారు. అంతకుముందు రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ శివ మోహన్‌రెడ్డి, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆపన్న హస్తాల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - పెద్దముడియం



ఆదుకోవాలని వేడుకుంటున్న మల్లేష్

మండలంలోని పెద్ద పసుపుల గ్రామ దళితవాడకు చెందిన మల్లేష్ అనే వ్యక్తి కొంతకాలంగా కిడ్నీ, కాలేయం వ్యాధులతో బాధపడుతున్నాడు. మల్లేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. రెక్కాడితేకానీ డొక్కాడని మల్లేష్ కుటుంబం. జబ్బు నయం చేయించుకునేందుకు బంధువులు, తెలిసిన వారి వద్ద కొంత డబ్బు అప్పుగా తీసుకున్నాడు. ఇటీవల వ్యాధి మరింత తీవ్రతరం కావడంతో మల్లేష్‌కు వైద్యం చేయించుకునేందుకు కష్టంగా ఉంది. మంచానికే పరిమితమయ్యాడు. వారంలో రెండు సార్లు డయాలసిస్ చేయాలని వైద్యులు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదని మల్లేష్ కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. తమను దాతలు ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ తక్షణమే ప్రకటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను తక్షణమే ప్రకటించాలని బుధవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కడప ఆర్‌డిఒ కార్యాలయం పరిపాల నాధికారి శంకర్రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మెగా డిఎస్‌సి కోసం అనేక పోరాటాలు చేశామన్నారు. తమ పోరాటం ఎన్నికల ముందు రాజకీయ ఎజెండాగా మారిందని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వస్తే మొదటగా అమలు చేసేది మెగా డిఎస్‌సి అని చెప్పి ఎన్నికల ముందు యువతకు హామీ ఇచ్చి ప్రస్తుతం కాలయాపన చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నగర నాయకులు ఉదయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు రూరల్ : మెగా డిఎస్‌సిపై చేసిన మొదట సంతకం హామీ ఎమైందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ప్రశ్నించారు. వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జమ్మలమడుగు ఆర్‌డిఒ కార్యాలయంలో పరిపాలన అధికారి నిజాముద్దీన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, పట్టణ నాయకులు సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా మెగా డీఎస్సీపై చేసిన మొదట సంతకం హామీ ఏమైందని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరి కుమార్, విశ్వనాథ్ ప్రశ్నించారు. బుధవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో డిటి సాయినాథ్‌కు వినతి పత్రం ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన 16 వేల ఉపాధ్యాయ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు.

బద్వేలు : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా మెగా డిఎస్‌సిపై చేసిన మొదటి సంతకం హామీని అమలు చేయాలని డివైఎఫ్ఐజిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని కోరారు. ఆ మేరకు బుధవారం బద్వేల్ డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌డిఒకు వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే మస్తాన్, షరీఫ్, ఎస్‌కే ఆదిల్ యువరాజ్ పాల్గొన్నారు.

అప్పుల వల్ల సంక్షేమ పథకాలు అమలు చేయలేని పరిస్థితి

- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ గతంలో చేసిన అప్పుల వల్ల సంక్షేమ పథకాలు అమలు చేయలేని పరిస్థితి ఏర్పడిదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో విపరీతమైన అప్పులు అయ్యాయని తెలిపారు. అందుకు తగ్గ ఆస్తులు కూడబెట్టలేదన్నారు. గత ప్రభుత్వం చేసిన రూ.10లక్షల కోట్లు అప్పుకు రూ.72 కోట్ల వడ్డీ కడుతున్నామన్నారు. ఇప్పటికీ కాంట్రాక్టర్లు చేసిన పనులకు డబ్బులు చెల్లించలేని పరిస్థితి అన్నారు. బకాయిలు చెల్లిస్తేనే కొత్త అప్పులు రాష్ట్రానికి వచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు.నిరంతరం రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి 7 నెలలు అయిందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలు గమనించాలన్నారు. మాజీ కౌన్సిలర్ పుల్లయ్య, ఘంటసాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సిఐ దస్తగిరి తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం సిఐ దస్తగిరి ఆధ్వర్యంలో ఎస్ఐ మైనుద్దీన్ పోలీస్‌స్టేషన్ నుండి పాతబస్టాండ్ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. బైక్ నడిపేవారు హెల్మెట్, కారు డ్రైవింగ్ చేసేప్పుడు సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలన్నారు. రహదారి నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎఎస్ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు వాణి, యశోద, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

1న ఒపి ఉచితం : డాక్టర్ హరికిషోర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



స్థానిక సాయికుటీర్ రోడ్డులోని హరికిషోర్ న్యూరో, స్పైన్ అండ్ ఇఎన్‌టి కేర్ హాస్పిటల్‌లో ఫిబ్రవరి 1న ఇపి ఉచితమని ఆ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ హరి కిషోర్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తమ హాస్పిటల్ 5వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం హాస్పిటల్‌కు వచ్చేవారికి ఒపి ఉచితమన్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు, ఎక్స్‌రేలపై 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. తమ హాస్పిటల్‌లో న్యూరో విభాగంలో ప్రొద్దుటూరు పట్టణంలోనే మొట్టమొదటి న్యూరో సర్జరీ (24 గంటల) వైద్య సదుపాయం, పక్షవాతం వచ్చిన నాలుగున్నర గంటలలోపు వచ్చిన వారికి ప్రత్యేక చికిత్స ఉందన్నారు. తమ వార్షికోత్సవ ఆఫర్‌ను రోగులు సద్వినియోగం చేయాలని ఆయన కోరారు.

బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు

ప్లాంట్ ఏర్పాటు కానున్న స్థలం ఇదే

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మండలంలోని బిదినంచర్లలో ప్రభుత్వ భూములను గుర్తించేందుకు రెవన్యూ శాఖ కసరత్తు ప్రారంభించింది. కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల ఉపాధి అవకాశాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థానికులకు లభించనున్నాయి. ఈ ప్లాంటు దాదాపు 150 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు సంబంధిత ప్లాంటుకు ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బిదినంచర్లలోని 706 సర్వే నెంబర్‌లో ఉన్న డికెటి భూమిని గుర్తించారు. బిదినంచర్లలో కంప్రెస్డ్ బయో ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి భూములను గ్రామ రెవెన్యూ అధికారి వరలక్ష్మి, సర్వేయర్ శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వ భూములను గుర్తించారు. త్వర లోనే ఆ భూములకు సంబంధించి గుర్తులను ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకోనున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలన..

మండలంలోని బిదినంచర్లలో ఉన్న ప్రభుత్వ భూమిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలన చేశాం. ఇక్కడ కంప్రెసెడ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు కావలసిన భూమి చూశాం. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. **- నాగేశ్వరరావు, తహశీల్దార్, సింహాద్రిపురం**

రాజకీయ దొంగలను తయారు చేసింది వైసిపినే

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాజకీయ నాయకులను దొంగలుగా తయారు చేసిన పార్టీ వైసిపి అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన బిటెక్ రవితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ సొమ్మును ఇష్టానుసారంగా దోపిడీ చేసిన ఘనత వైసిపిదేనని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పులమయం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. సూపర్‌సిక్స్ పథకాలు కచ్చితంగా అమలు చేస్తామన్నారు. అభివృద్ధి ఎలా చేయాలో తమ నాయకుడు చంద్రబాబుకు తెలుసని అన్నారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు. వైసిపి నాయకులు అధికారం పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. మద్యం, ఇసుక, గ్రావెల్ అమ్ముకున్నది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. పులివెందుల అభివృద్ధికి రూ.6000 కోట్లు కేటాయిస్తే ఎక్కడ కూడా పూర్తిగా అభివృద్ధి చెందలేదన్నారు. సొమ్మును దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం అరటి ధరలు పెరిగాయంటే వైసిపి కీలక నేతలు పులివెందులలో లేకపోవడం వల్లే అన్నారు. గతంలో అరటి వ్యాపారులను బెదిరించి ధరలు పెరగకుండా చేసింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. వైఎస్ అవినాష్‌రెడ్డి ఎంపీ అయినప్పటి నుంచే పులివెందులలో జూదం, మట్కా పెరిగాయని తెలిపారు.

మాట్లాడుతున్న ఆర్.శ్రీనివాసరెడ్డి

పులివెందులలో జరుగుతున్న దొంగతనాలు అంతరాష్ట్ర దొంగల పనేనని పోలీసులు గుర్తించారన్నారు. ఇప్పటికైనా నిజాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. రెండు మూడు రోజుల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు అవుతాయని, వాటిని అమర్చి చెరువులకు నీళ్లు నింపుతామన్నారు. పాడాను రద్దు చేయడంతో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడానికి ఆలస్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి

విద్యార్థికి నగదు బహుమతి ఇస్తున్న ఆర్‌జెడి రవి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్‌జెడి, ఉర్దూ కళాశాల ప్రిన్సిపల్ రవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఉర్దూ కళాశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతమైన మనస్సుతో చాలా మంది కళాశాలకు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు అన్నారు. ఉర్దూ కళాశాలలో ల్యాబ్ కోసం రూ.15 లక్షలను కలెక్టర్ ద్వారా ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మంజూరు చేయించడంపై ధన్యవాదాలు తెలిపారు. కళాశాలకు మంచి పేరు వచ్చేలా మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కళాశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు అధ్యాపకులు కూడా ఉన్నట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం శాశ్వతంగా కళాశాలలో టాపర్‌గా వస్తున్న విద్యార్థులకు రూ.3 వేలు ఇవ్వడం జరుగుతుందని రిటైర్డ్ టీచర్ నరసింహారెడ్డి హామీ ఇచ్చారు. టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి పైనాన్స్ కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ మాట్లాడారు. ప్రభుత్వ ఉర్దూ కళాశాలకు తన తండ్రి పేరు మీద కొట్టే నారపురెడ్డి తరుపున సహకరిస్తానని నారాయణ పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. అనంతరం కళాశాలకు సిసి కెమెరాలు ఇచ్చిన దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపల్ హబిబుల్లా, కళాశాల కమిటీ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ బాషా, ఎఇఒలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్, వేముల, చక్రాయపేట కళాశాల ప్రిన్సిపల్ రామసుబ్బయ్య, రహంతు బాషా, టిడిపి యవనేత రజనీకాంత్ రెడ్డి, వైసిపి ప్రధాన కార్యదర్శి నిసార్ బాషా, కళాశాల కాంట్రాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందుల అభివృద్ధికి కృషి చేస్తా : కలెక్టర్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కలెక్టర్‌తో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్

పులివెందుల నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో బుధవారం ఆయన ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవీంద్రనాథ్ రెడ్డి నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసు కువెళ్లారు. ప్రధానంగా వేంపల్లి రోడ్డు, పులివెందులలోని భాకరాపురం, రాణి తోపు రోడ్డు, మురుగుకాలువలు, తాగునీరు, అరటి శీతల గిడ్డంగి యూనిట్, వీధిలైట్లు వంటి పనులు మధ్యలో ఆగిపోయాయని వివరించారు. వీటికి నిధులను మంజూరు చేసేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ పనులన్నీటికి నివేదికలు తెప్పించుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ రాముడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు కొనసాగించడానికి నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, వైస్ ఛైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, ఖాదర్, రసూల్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కోరారు. పులివెందుల ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో బుధవారం వారు కలెక్టర్‌ను కలిశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్ధాంతరంగా ఆగిపోయిన అత్యంత అవసరమైన యూజీడీ, ఎస్టీపీ, రాణితోపు రోడ్, శ్మశాన వాటిక, వాటర్‌గ్రిడ్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రేషన్ పంపిణీ వ్యవస్థ పులి వెందులలో చాలా అధ్వానంగా తయారైందన్నారు. వీటిపై చర్యలు తీసుకో వాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. సుంకర రవి పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. చాగలమర్రి, ప్రొద్దుటూరు-వేంపల్లి, రాయచోటి నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనుల్లో భాగంగా బుధవారం వేంపల్లె మండలంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద జరుగుతున్న రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులను పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పనుల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. గండి రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులు కొద్ది మేరకు జరిగినట్లు బిటెక్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రోడ్ల పనులు నిలిచిపోవడంతో ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని బిటెక్ రవి కలెక్టర్‌కు వివరించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య, ఆర్‌అండ్‌బి డిఇ మాధవి, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, డక్కా రమేష్, మహమ్మద్ ఇనాయతుల్లా, రజనీకాంత్‌రెడ్డి, వేమకుమార్, వీరబద్ర, మడక శ్రీనివాసులు, శివ, డాక్టర్ కరీముల్లా, శేషారెడ్డి, కొండయ్య, భాస్కర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

డిఎస్‌పిని కలిసిన ఎన్‌సిసి విద్యార్థులు

ఎన్‌సిసితో ప్రాధాన్యత ఉంటుంది : డిఎస్‌పి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

డిగ్రీ విద్యార్థులు ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసిలో ఉండడం మంచి అవకాశమని డిఎస్‌పి పుతి భావన అన్నారు. బుధవారం స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌సిసి యూనిట్ విద్యార్థులు నూతనంగా ప్రొద్దుటూరుకు వచ్చిన డిఎస్‌పి పుతి భావనను గౌరవప్రదంగా కలిశారు. కళాశాల కో-ఆర్డినేటర్ గౌరి శంకర్ ఎన్‌సిసి విద్యార్థులతో కలిశారు. డిఎస్‌పికి వుడ్‌తో చేసిన జాతీయ పతాకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఎన్‌సిసిలో ఉండడం మంచి అవకాశం, తద్వారా వచ్చే బి, సి సర్టిఫికెట్స్‌తో మీకు భవిష్యత్‌లో ఉద్యోగాల్లో మంచి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎన్‌సిసి ఇన్‌స్ట్రక్టర్ దావీద్, ఎన్‌సిసి క్యాడేట్స్ పాల్గొన్నారు.

విభజన చట్టాన్ని మరచిన ప్రభుత్వాలు : నజీర్ అహ్మద్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విజజన చట్టాన్ని మరచి రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పూల నజీర్ అహ్మద్ విమర్శించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతిలో సాక్షాత్తు వెంకటేశ్వరస్వామి సాక్షిగా విభజన చట్టాన్ని అమలు చేస్తామని ప్రమాణం చేసిన ప్రధాని దాన్ని మరిచారన్నారు. ప్రశ్నించే ధైర్యం రాయలసీమకు చెందిన ఏ ఎమ్మెల్యేకు లేదన్నారు. కేంద్రం మెడలు వంచి అని అధికారంలోకొచ్చిన జగన పార్టీ 11సీట్లకే పరిమితమైందన్నారు. ప్రజాసంక్షేమం కోసం త్యాగం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీయే అన్నారు. ప్రొద్దుటూరులోని అసాంఘిక కార్యక్రమాలపై టిడిపి, వైసిపి గోలగోల చేస్తున్నాయని తెలిపారు. ఒకరిపై మరొకరు నిందలు వేసుకుంటున్నాయని చేసింది ఏమీలేదన్నారు. తాను 1985 నుండి కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించానన్నారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశానన్నారు. ఇప్పటికీ తాను ఇందిరాగాంధీ, రాహుల్‌గాంధీ కుటుంబ సభ్యునిగానే ఉన్నానన్నారు. కుందూ-పెన్నా వరద కాలువ ఆగిపోయేందుకు రాచమల్లు కారణమన్నారు. అసాంఘిక కార్యక్రమాలను అరికట్టాల్సిన బాధ్యత పోలీసులు తీసుకోవాలన్నారు. స్థానికంగా ఇర్ఫాన్‌ను పార్టీ సమన్వయకర్తగానే అధిష్టానం నియమించిందని నజీర్ అన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జిలాన్ మాట్లాడుతూ పార్టీలో ఉండే సమస్యలను అధిష్టానం దృష్టిలో ఉంచుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నజీర్ పార్టీ ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడే పార్టీలో చేరికలుండేవని ఆయన గుర్తు చేశారు. టిడిపి ఆరు సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు ఖాజాపీర్, అలీ, సుధీర్ పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యం, కేసులపై ఆరా

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎస్.బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు సబ్ జైలును సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎస్.బాబా ఫక్రుద్దీన్ బుధవారం సందర్శించారు. ముందుగా ఆయన రిజిస్టర్లను తనఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను వివరించారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలు, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జైలు పరిసరాలను, వంట గదులను, వసతి గదులను, టాయిలెట్లను పరిశీలించి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో జమ్మలమడుగు సబ్ జైలు సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌రెడ్డి, ప్యానల్ న్యాయవాదులు బి.వి.సుబ్బారావు, పాలజీ రవి, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - ముద్దనూరు

జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస సూచించారు. చెన్నారెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో బుధవారం వాసా శ్రీనివాస ఆధ్వర్యంలో పశు సంక్షేమ పక్షోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుండి పశువులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. పిల్లులు, కుక్కలు, వీధి కుక్కలతో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పిల్లులు, కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు (రేబీస్) వేయించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

7న 'లక్ష డప్పులు-వేల గొంతుకలు'

- ఎంఎస్‌పి ఇన్‌ఛార్జి వై.చిన్నయ్య మాదిగ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరగబోయే లక్ష డప్పులు-వేల గొంతుకలు అనే భారీ సాంస్కృతిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జమ్మలమడుగు ఎంఎస్‌పి ఇన్‌ఛార్జి వై.చిన్నయ్య మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం జిల్లా ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు వెంకటేష్ మాదిగ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద పసుపుల మోటు నుంచి ఆర్‌అండ్‌బి బంగ్లా వరకు డప్పులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెంకటేష్ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం హైదరాబాద్‌లో ఆయా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జమ్మలమడుగు నుండి భారీ సంఖ్యలో మాదిగ బిడ్డలు, దళిత ఉపకులాల నాయకులు హాజరై సభను విజయవంతం చేయాలని వెంకటేష్ కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు కెఎన్ రాజు, వీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్, పెద్దముడియం మండల ఇన్‌ఛార్జి దస్తగిరి, పట్టణ కార్యదర్శి చిన్న వెంకటసుబ్బయ్య, నరసింహులు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చంద్రకుమార్, శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

కూలీలకు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రిక్షా హమాలీ, వలస కార్మికులు, అడ్డా కూలీలకు ఆర్థికంగా నిలబడడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలవారి పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని మహాజన రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షుడు యామవరం చంద్రశేఖర్ కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల జీవన విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గమనించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆధునిక విధానంలో కూడా జనజీవన స్రవంతిలో మోటో జీవితాన్ని గడుపుతున్న కార్మికులను ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా చొరవ చేసుకొని ఆయా కార్మికుల కష్టాలు, ఆర్థిక పరిస్థితులు, వారి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటగా ప్రభుత్వాలు అండగా ఉండాలని కోరుతున్నామన్నారు. దళిత సమైక్య నాయకుడు ఎల్లయ్య, సుబ్బ రాయుడు, సుదర్శన్, బాలకుమార్, కార్మికులు బాల నరసింహులు, దువ్వూరు నారాయణ, భాస్కర్, మాల మహానాడు నాయకుడు పుల్లయ్య, ఆనంద్, శివాంజనేయులు, గంగులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు

చాపాడు : మండల పరిధిలోని సీతారామా పురం గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి మ్యాగీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉంచుతామని తెలిపారు. పెద్ద గురువలూరు గ్రామ వ్యవసాయ సహాయకులు గోపిరామ్, రైతులు పాల్గొన్నారు.

టిడిపితోనే బిసిల సాధికారత అనడం సరికాదు

వేంపల్లె : టిడిపితోనే రాష్ట్రంలో బిసిలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక సాధికారత వచ్చిందని కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడుతో పాటు టిడిపి నాయకులు వ్యాఖ్యానించడంలో వాస్తవం లేదని బుధవారం విలేకరులతో పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు.

CHANGE OF NAME

I, Sajjala Nepal Reddy, S/o Sajjala Ramakrishna Reddy, R/at DNo. 2-65-A, Peddajutur (V), Vemula (M), YSR Kadapa Dist, AP. I have chan ged my son name from Sajjala Sai Sandeep Reddy (Old Name) to Sajjala Sandeep Reddy (New Name).

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
O.S.No. 532/2020

ఇడమడక రామాంజనేయులు, S/o రామయ్య, హిందూ, 52 సం॥లు, డోర్‌నెం.8/573, గిడ్డంగివీధి, ప్రొద్దుటూరు. ...వాది

Vs

యెన్నం రామమోహన్‌రెడ్డి, S/o వెంకట రామిరెడ్డి, హిందూ, 48 సం॥లు, కొర్రపాడు గ్రామం, రాజుపాళెం మం॥, ప్రస్తుతం ఫ్లాట్ నెం. 201, రాఘవేంద్ర టవర్స్, ఎపిహెచ్‌బికాలని, ప్రొద్దుటూరు. ...ప్రతివాది

సమను/నోటీసు

పై నెంబరు దావాను దావా మొత్తం వగైరాలు రా కోరి మరియు I.A.No.778/2020వ పిటిషన్‌ను పిటిషన్ షెడ్యూలు దాఖల ఆస్తులను తీర్పునకు ముందు జప్తు చేయ లాగున రెస్పాండెంట్ ప్రతివాది అయిన నీ పైన దాఖలు చేసి ఉన్నాడు. అట్టి దావా యందు మరియు I.A.No.778/2020వ పిటిషన్ యందు నీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టు యందు 12.03.2025వ తేదీన స్వయంగా కానీ, లాయరు గారి ద్వారా కానీ హాజరై తె/లుపుకొనవలెను.లేనిచో నీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా తేది: 12.03.2025

//By Order of the Court//

ఎన్.వి.వరప్రసాద్
అడ్వకేట్,
ప్రొద్దుటూరు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE; PRODDATUR
I.A.No. 399/2023
O.S.NO. 72/2021

Obulareddi Rama Chandra Reddy, S/o Bala Venkata Reddy, aged about 72 years, Hindu, Rtd Principal, residing at D.No.15/252, K.Appaya Palli Village and Post, Kamalapuram Mandal, Kadapa District. ...Petitioner/Plaintiff

Vs

Yerraguntla Rama Subba Reddy died his LRs
2. Yerraguntla Sunanda W/O Obula Reddy, aged about 58 years, Hindu,
3. Yerraguntla Obula Reddy S/O Late Rama Subba Reddy, aged about 33 years,
4. Yerraguntla Sreekanth Reddy S/O Late Rama Subba Reddy, aged about 28 years,
all are residing at D.No.45/197-11, Balaji Nagar, Kadapa City and Kadapa District. ...Respondents/Defendants

NOTICES TO RESPONDENTS NO.2 TO 4

పైన కనపరిచిన వాది సదరు దావాను 1వ ప్రతివాది అయిన యర్రగుంట్ల రామ సుబ్బా రెడ్డి గారి పైన ప్రొనోటు నిమిత్తం బాకీ రాకోరి సదరు దావాను రాజశ్రీ పై కోర్టు యందు దాఖలు చేసి వున్నారు. సదరు దావా పెండింగులో వుండగా సదరు 1 వ ప్రతివాది అయిన యర్రగుంట్ల రామ సుబ్బా రెడ్డి గారు గతించినందున వారి వారసులు అయిన మిమ్ములను సదరు దావాలో ప్రతివాదులుగా చేర్చుటకు గాను పిటిషన్ దాఖలు చేయగా 2,3,4, రెస్పాండెంట్లు అయిన మీరు రాజశ్రీ పై కోర్టు యందు 06.02.2025 వ తేదీన ఉ.10.30 ని॥లకు హాజరగుటకు గాను వాయిదా ఉంటూ వున్నది. కావున మీరు స్వయముగా కాని లేదా వకీలు ద్వారా కాని పై రాజశ్రీ కోర్టు యందు హాజరు అయి మీకు ఏమైనా ఆక్షేపణలు వున్నయడల తెలుపుకోవలసివున్నది. లేని యడల మిమ్ములను పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది: 06.02.2025

//By Order of the Court//

B.SREENIVASULU, B.A.,LL.B.,
Advocate,
Kamalapuram.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: PRODDATUR
I.A.NO. 12/2023
O.S.NO. 72/2021

Obulareddi Rama Chandra Reddy, S/o Bala Venkata Reddy, aged about 72 years, Hindu, Rtd Principal, residing at D.No.15/252, K.Appaya Palli Village and Post, Kamalapuram Mandal, Kadapa District. ...Petitioner/Plaintiff

Vs

Yerraguntla Rama Subba Reddy died his LRs
2. Yerraguntla Sunanda W/O Obula Reddy, aged about 58 years, Hindu,
3. Yerraguntla Obula Reddy S/O Late Rama Subba Reddy, aged about 33 years,
4. Yerraguntla Sreekanth Reddy S/O Late Rama Subba Reddy, aged about 28 years,
all are residing at D.No.45/197-11, Balaji Nagar, Kadapa City and Kadapa District. ...Respondents/Defendants

NOTICES TO RESPONDENTS NO.2 TO 4

పైన కనపరిచిన వాది సదరు దావాను 1వ ప్రతివాది అయిన యర్రగుంట్ల రామ సుబ్బా రెడ్డి గారి పైన ప్రొనోటు నిమిత్తం బాకీ రాకోరి సదరు దావాను రాజశ్రీ పై కోర్టు యందు దాఖలు చేసి వున్నారు. సదరు దావా పెండింగులో వుండగా సదరు 1 వ ప్రతివాది అయిన యర్రగుంట్ల రామ సుబ్బా రెడ్డి గారు గతించినందున వారి వారసులు అయిన మిమ్ములను సదరు దావాలో ప్రతివాదులుగా చేర్చుటకుగాను పిటిషన్ దాఖలు చేయగా 2,3,4, రెస్పాండెంట్లు అయిన మీరు రాజశ్రీ పై కోర్టు యందు 06.02.2025 వ తేదీన ఉ.10.30 ని॥ లకు హాజరగుటకు గాను వాయిదా ఉంటూ వున్నది. కావున మీరు స్వయముగా కాని లేదా వకీలుద్వారా కాని పై రాజశ్రీ కోర్టు యందు హాజరు అయి మీకు ఏమైనా ఆక్షేపణలు వున్నయడల తెలుపుకోవలసివున్నది. లేని యడల మిమ్ములను పరోక్షముగా తీర్మానించబడును..

వాయిదా తేది: 06.02.2025

//By Order of the Court//

B.SREENIVASULU, B.A.,LL.B.,
Advocate,
Kamalapuram.